

ఆసిఫాబాద్‌లో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూం

# మంచిర్యాలలో అత్యల్పం.. బోథ్‌లో అత్యధికం..

## ఇదీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ శాతం

- బోథ్‌లో 82.86.. మంచిర్యాలలో 63.06 పర్సంటేజ్
- సమయం ముగిసినా అప్పటికీ కేంద్రాల్లో నిల్చున్న వారికి ఓటేసే అవకాశం
- స్ట్రాంగ్ రూములకు చేరిన ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు
- ఆయాచోట్ల భారీ పోలీసు బందోబస్తు ● 3న తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- గెలుపు అంచనాలు.. ఓటింగ్ సరళిపై చర్చ

ఆదిలాబాద్ /కుమ్రం భీం ఆసిఫాబాద్, డిసెంబర్1(నమస్తేతెలంగాణ): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని పది నియోజకవర్గాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకున్నారు. గురువారం ఉదయం 7గంటల నుంచి ప్రారంభమైన పోలింగ్.. సాయంత్రం 5గంటల దాకా కొనసాగింది. పోలింగ్ కేంద్రాల్లో క్యూలైన్‌లో నిల్చున్న వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. పోలింగ్ తీరును జిల్లా ఎన్నికల అధికారులు ఎప్పటికప్పుడూ గమనిస్తూ అధికారులు, సిబ్బందికి తగిన సలహాలు,సూచనలు అందజేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బోథ్ నియోజకవర్గంలో అత్యధికంగా 82.86 శాతం, మంచిర్యాలలో అతి తక్కువగా 69.06శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ అనంతరం అధికారులు ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు, కంట్రోల్ యూనిట్లను ఆయా నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములకు తరలించారు. 10 నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలలో ఈవీఎంలను అధికారులు భద్రపర్చి సీల్ చేశారు. స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్టమైన పోలీసుబందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీలు శుక్రవారం స్ట్రాంగ్ రూములను పరిశీలించి భద్రతను పరిశీలించారు.

### స్ట్రాంగ్ రూముల్లో ప్రజా నిర్ణయం

ఈ ఎన్నికల్లో ప్రజా నిర్ణయం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. భద్రంగా స్ట్రాంగ్ రూముల్లోకి చేరింది. గురువారం రాత్రి వరకు పోలింగ్ నిర్వహించిన అధికారులు ఎన్నికల సామగ్రిని బందోబస్తుతో స్ట్రాంగ్ రూముల్లోకి చేర్చారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల్లోకి చేర్చారు. కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవ్‌రావు, ఎస్పీ సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో వివిధ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల బాక్స్‌లకు స్ట్రాంగ్ రూంలో ఉంచి సీల్ వేశారు. ఈ నెల 3న ఓట్ల లెక్కింపుకోసం ఏర్పాట్లను ప్రారంభించారు. స్ట్రాంగ్ రూం వద్ద భారీ భద్రత ఏర్పాటు చేశారు.

### గెలుపు అంచనాల్లో అభ్యర్థులు

గురువారం నాటి పోలింగ్‌తో ఎన్నికల నిర్వహణలో ముఖ్యఘట్టాలు ముగిశాయి. ఇక మిగిలింది స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచిన ఈవీఎంలను తెరిచి ఈ నెల 3న ఓట్లు లెక్కించి ఫలితాలను వెల్లడించడమే. గురువారం జరిగిన పోలింగ్ సరళి.. తమ తమ గెలుపు అవకాశాలపై పోటీలో ఉన్న అభ్యర్థులు తమ అనుచరులతో అంచానాలు వేసుకుంటున్నారు. ఏయే మండలాల నుంచి ఏ గ్రామాల్లో తమకు ఓట్లు ఎక్కువగా పడే అవకాశాలు ఉన్నాయి. ! ఏ పోలింగ్ కేంద్రం పరిధిలో తమకు లీడ్ వస్తుందనే విషయాలపై అభ్యర్థులు అనుచరులతో అంచనాలు వేసుకుంటున్నారు. మండలాల వారీగా కార్యకర్తలను ఇంటికి పిలిపించుకొని ఆరా తీస్తున్నారు. ఇక గిరిజన గ్రామాల్లో రాత్రి వరకు పోలింగ్ జరుగడం.. గతంలో కంటే ఎక్కువ శాతం పోలింగ్ నమోదు కావడంతో ఎంతవరకు గెలుపునకు అవకాశాలు ఉన్నాయనే విషయాలను చర్చించుకుంటున్నారు.



స్ట్రాంగ్ రూమ్‌కు సీల్ వేస్తున్న కలెక్టర్, ఎస్పీ, అధికారులు

# కోడ్ వేళ.. 'కోట్ల' కట్టడి

**ఎన్నికల అక్రమార్కులను వెంటాడిన పోలీసులు**

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో విస్తృత తనిఖీలు
- నగదు, మద్యం పంపిణీ అడ్డుకట్టకు చర్యలు
- చెక్‌పోస్టులు, తనిఖీలతో ప్రలోభాలపై నిఘా
- రూ.9,09,31,932 పట్టివేత
- రూ. 3,22,51,011 విలువైన మద్యం స్వాధీనం



కాసిపేట : చెక్ పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ మహేందర్ రెడ్డి



ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని సీజ్ చేసిన పోలీసులు (ఫైల్)




అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు (ఫైల్)

నిర్మల్, డిసెంబర్ 1(నమస్తే తెలంగాణ): ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి పోలీసులు పక్కా వ్యూహంతో ముందుకెళ్లారు. ప్రలోభాలపై దృష్టి పెట్టారు. గెలుపు కోసం పార్టీల నేతలు పెద్ద మొత్తంలో నగదు, మద్యం పంపిణీలకు శ్రీకారం చుట్టారు. అయితే ఎన్నికల కమిషన్ ఆదేశాలకనుగుణంగా జిల్లా పోలీసులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఎస్పీ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో అన్ని పార్టీల అక్రమ కార్యకలాపాలపై నిఘా పెట్టారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా మద్యం, నగదు పంపిణీ చేసే వారిపై ప్రత్యేక దృష్టి పెట్టి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగానే ఆయా పార్టీల నేతలు, వారి అనుచరులు, కార్యకర్తలు నగదును తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిరంతర తనిఖీలతో దాదాపు రూ. కోటీ 50లక్షల నగదును స్వాధీనం చేసుకోవడం విశేషం. దీంతో పాటు రూ.28 లక్షల విలువైన మద్యం, నాటు సారాకు వినియోగించే బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. అయినప్పటికీ పోలీసుల కళ్లుగప్పి భారీ మొత్తంలో నగదు, మద్యం పంపిణీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఓటర్లను ప్రలోభ పెట్టే ప్రయత్నాలు చేసినట్లు ఈ కాంగ్రెస బీజేపీపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. కాగా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి జిల్లాలో మొత్తం ఎన్నికల నియమావళి ఉల్లంఘన కేసులు 21 నమోదయ్యాయి. అలాగే ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తల నడుమ జరిగిన గొడవలకు సంబంధించి 7 కేసులను నమోదు చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

### పకడ్బందీ చర్యలతో ప్రశాంతంగా ఎన్నికలు..

కాగా జిల్లా పోలీసులు తీసుకున్న ముందస్తు జాగ్రత్తల కారణంగా జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఎన్నికల నిర్వహణకు దాదాపు 2700 మంది కేంద్ర రిజర్వ్ పోలీసు బలగాలను వినియోగించారు. జిల్లా ఎస్పీ ప్రవీణ్‌కుమార్‌తో పాటు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసు అధికారులు బందోబస్తును పర్యవేక్షించారు. ముఖ్యంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న 229 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. హోరాహోరీగా సాగిన ఎన్నికల పోరులో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా జిల్లా పోలీసులు ఎంతో సమన్వయంతో వ్యవహరించడం వల్లనే ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని పలువురు జిల్లా పోలీసులను ప్రశంసిస్తున్నారు.



పోలీసులు పట్టుకున్న రూ. 50లక్షల (ఫైల్)

### కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలలో

కుమ్రం భీం ఆసిఫాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్న అధికారులు రాజకీయ పార్టీల ప్రలోభాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. జిలాల్లో చెక్‌పోస్టులను పెట్టి వాహనాలు, అనుమానాస్పద వ్యక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఎన్నికల నిర్వహణ వరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరిపిన తనిఖీల్లో రూ. 2కోట్ల 24వేల 106ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటికి సంబంధిత వ్యక్తుల వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో అధికారులు సీజ్ చేశారు. దాదాపు రూ.10 లక్షల విలువైన మద్యం, 300 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకోవడంతో పాటు ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా 3540 మందిని పోలీసులు బైండోవర్ చేశారు.

### ఆదిలాబాద్ జిల్లాలో..

ఎదులాపురం, డిసెంబర్ 1: ఆదిలాబాద్ జిల్లాలో ఎన్నికల కోడ్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.1,61,31,251 నగదు సీజ్ చేశారు. జిల్లా పరిధిలోకి వచ్చే ఆదిలాబాద్, బోథ్‌తో పాటు ఆసిఫాబాద్, ఖానాపూర్ నియోజకవర్గాల పరిధి మండలాల్లో ఈ తనిఖీలు కొనసాగాయి. దీంతో పాటు రూ. 42,12,292 లీటర్ల అక్రమ మద్యం సీజ్ చేశారు. వీటి విలువ సుమారు రూ.25,61,769 ఉంటుంది. ఎన్నికల సందర్భంగా 405 కేసులు నమోదు కాగా, 407 మందిని అరెస్టు చేశారు. 310 బెల్ట్‌షాపులను మూసివేశారు. అదే విధంగా 80.660 కేజీల గంజాయి పట్టుకున్నారు. దీని విలువ రూ.20 లక్షల 48 వేలు ఉంటుంది. ఇందులో 8 కేసులు నమోదు కాగా 13 మందిని అరెస్టు చేశారు. 863 కేసుల్లో 1394 మందిని బైండోవర్ చేశారు.

### మంచిర్యాల జిల్లాలో

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 1: మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా అధికారులు, పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. పెద్ద ఎత్తున నగదు, మద్యం పట్టుకున్నారు. ఇందులో మొత్తంగా రూ. 3,99,02,018 నగదు పట్టుబడింది. దీంతో పాటు 61913.06 లీటర్ల నగదు పట్టుకోగా, దీని విలువ 2,58,89,443 ఉంటుంది. దీంతో పాటు మాదక ద్రవ్యాల విలువ రూ. 6,51,285గా ఉంటుంది. ఇక బంగారం, చీరెలు, టీషర్టుల విలువ రూ 21,89, 000 ఉంటుంది. వాహనాలు 32 పట్టుబడ్డాయి. ఇక మొత్తంగా 665 కేసులు నమోదయ్యాయి.

# కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించాలి

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు**

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 1 :జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈ నెల 3న నిర్వహించే కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా ప్రతినిధులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాహుల్ మహివాల్, 001–సిర్పూర్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, 005–ఆసిఫాబాద్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణులతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులతో సమీక్ష నిర్వహించి ఎన్నికలపై అభ్యంతరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ సిర్పూర్ నియోజకవర్గంలోని 55, 56, 75, 90 పోలింగ్ కేంద్రాలపై వచ్చిన ఫిర్యాదులను 17 ఏ, ప్రొసైడింగ్ అధికారి డెయిరీని ప్రతినిధుల సమక్షంలో పరిశీలించి జిల్లాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా ఎన్నికల ప్రశాంతంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈనెల 3న జరుగనున్న కౌంటింగ్ కోసం అభ్యర్థులు తమ తరఫున పాల్గొని కౌంటింగ్ ఏజెంట్లకు ఫారం 18 సమర్పిస్తే రిటర్నింగ్ అధికారుల ద్వారా అనుమతులు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు



ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు



# ఆదివాసీల జీవితాల్లో వెలుగులు

**పునరావాసం, వసతుల కల్పన పూర్తి**

- 94 ఇండ్ల నిర్మాణం, కుటుంబానికి 3 ఎకరాల భూమి ● ప్రారంభానికి సిద్ధంగా ఇండ్లు



కొత్తమద్దిపడగలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లు



కొత్తగా వేసిన సీసీ రోడ్లు, మురుగు కాలువలు



వాటర్ ట్యాంక్

కడెం, డిసెంబర్ 1: దేశంలో 42వ టైగర్‌జోన్ (కవ్వాల్ అభయారణ్యం) ఏర్పాటు కావడంతో నిర్మల్ జిల్లాలోని కడెం, దస్తురాబాద్ మండలాలతో పాటు, మంచిర్యాల జిల్లాలోని జన్నారం మండలాల్లోని 23 గ్రామాలను ఈ ప్రాంతం అటవీ నుంచి ఖాళీ చేయించి వారిని ఇతర ప్రాంతాలకు తరలించనున్నారు. అయితే అనేక ఏండ్ల పాటు అడవిలో జీవిస్తున్న ఆదివాసీలు మొదటగా ఈ ప్రాంతాలను ఖాళీ చేయడానికి ఆసక్తి చూపలేదు. కానీ ప్రభుత్వం ముందుకొచ్చి వారికి మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇవ్వడంతో ఆదివాసీలు వెళ్లడానికి ఆసక్తి చూపించారు. వనాన్నే నమ్ముకొని అటవీ సంపద ద్వారా తడకలు, బుట్టలు, ఇతర పండ్లను సేకరిస్తూ, వాటిని అమ్ముకుంటూ జీవనం సాగించిన వారికి ప్రభుత్వం పునరావాసం పేరిట మెరుగైన సౌకర్యాలను కల్పించనుంది. ఇందులో భాగంగా అభయారణ్యం పరిధిలోని కడెం మండలంలోని రాంపూర్, మైసంపేట గ్రామాలను మొదటి విడుత కింద ఎంపిక చేసిన అటవీశాఖ అధికారులు ఈ గ్రామాలు పూర్తి అటవీ ప్రాంతంలో ఉండడంతో వాటిని ముందుగా తరలించాలని నిర్ణయించారు.

### 94 కుటుంబాలకు ఇండ్లు

రాంపూర్, మైసంపేట గ్రామాలకు చెందిన 94 కుటుంబాలకు కడెం మండలంలోని కొత్తమద్దిపడగ గ్రామ సమీపంలో స్థలాన్ని కేటాయించి ఇండ్ల నిర్మాణం చేపట్టారు. డబుల్‌బెడ్ రూం ఇండ్లు, వాటికి మౌలిక సౌకర్యాలు కల్పించారు. అలాగే ఆదివాసీల కుటుంబాల కోసం కమ్యూనిటీ హాల్, అంగన్‌వాడీ కేంద్రం, రక్షిత మంచినీటి ట్యాంక్, చిన్నారుల కోసం ఆటవస్తువుల ఏర్పాటు, గ్రామానికి స్వాగతహారం, సీసీ రోడ్లు, ఇండ్ల ముందు ఆదివాసీల కలలకు సంబంధించిన పెయింటింగ్స్, ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేశారు. అయితే 94 కుటుంబాలకు సంబంధించిన ఇండ్ల పనులు ఇప్పటికే పూర్తికాగా, పెయింటింగ్ పనులు చేపడుతున్నారు. వీరికి ఇండ్ల నిర్మాణంతో పాటు, కడెం మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ పంచాయతీ పరిధిలోని పెత్తార్పు గ్రామ శివారులో ప్రతి కుటుంబానికి మూడెకరాల భూమి చొప్పున కేటాయించి, చదును చేయించారు. కొత్తమద్దిపడగ ప్రాంతంలో నివాస గృహాలు, అదే గ్రామాన్ని ఆనుకొని ఉన్న పెత్తార్పు ప్రాంతంలో వ్యవసాయ భూములను కేటాయించడంతో వారికి సాగుకు ఇక ఇబ్బందులుండవు. ఇండ్లకు, వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సౌకర్యాలను కూడా పూర్తి చేశారు. త్వరలోనే ఇండ్ల ప్రారంభం చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

### దగ్గరుండి నిర్మాణాలు చేయించుకున్నాం



రాంపూర్, మైసంపేట గ్రామాల్లో నివసించిన మమ్మల్ని మైదాన ప్రాంతాలకు తరలించడం ఆనందంగా ఉంది. అటవీ ప్రాంతాల నుంచి మాకు ఇండ్ల నిర్మాణం, వ్యవసాయ భూమిని కేటాయించి సకల సౌకర్యాలు కల్పించిన ప్రభుత్వానికి మా 94 కుటుంబాలు రుణపడి ఉంటం. అడవిలో ఉండే మాకు ఇలాంటి సౌకర్యాలు కల్పించి, మమ్మల్ని ఆదుకున్న సర్కారుకు ధన్యవాదాలు.

-జైవంత్‌రావు, లబ్ధిదారుడు



చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆటవస్తువులు



అంగన్‌వాడీ కేంద్రం